రాంనగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఉపేందర్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బాగ్‌లింగంపల్లికి చెందిన ఉపేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్ ఆయనకు నియమక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ... తనపై ఎంతో నమ్మకంతో బాధ్యత అప్పగించిన పదవిని అప్పగించడం ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, కార్పొరేటర్ రవిచారికి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి వివేక్‌కు సన్మానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర మంత్రిగా గడ్డం వివేక్ నియమితులు కావడం ఆనందంగా ఉందని బుధవారం డీఎస్‌డీ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీ ప్రతినిధులతో వెళ్లి బుధవారం మంత్రి గడ్డం వివేక్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. మంత్రిని సన్మానించిన వారిలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ డెఫ్ అధ్యక్షులు టి. చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుంది'

కాచిగూడ: టీపీసీసీ ప్రధానకార్యదర్శిగా నూతనంగా నియమితులైన నాగభూషణం ఆధ్వర్యంలో కాచిగూడ, అంబర్‌పేట ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి అభినందించి సత్కరించారు. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... పార్టీ కోసం నాగభూషణం ఎంతో కష్టపడి పనిచేశారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా అనేక సేవలందించారని తెలిపారు. నాగభూషణం లాంటి సీనియర్ నాయకుల సేవలు పార్టీకి ఎంతో అవసరముందని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కాచిగూడకు చెదిన సీనియర్ కాంగ్రెస్ నేత లక్ష్మణ్ యాదవ్, లక్‌పతి యాదగిరి, తోలుపునూరి కృష్ణ గౌడ్, నిరంజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను మెరుగు పర్చాలి

చిక్కడపల్లి: తాగునీటి సరఫరాను మెరుగు పర్చాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ వాటర్‌వర్క్స్ అధికారులను కోరారు. బుధవారం వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని ఆమె కలసి డివిజన్‌లోని లోప్రెషర్ సమస్యను వివరించారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. అధికారిని కలిసిన వారిలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

నగరంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా

ముషీరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అచ్చుత రమేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ... నగరంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తనను నియమించిన సీఎం రేవంత్ రెడ్డి, దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతమ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: డివిజన్‌లోని బ్రహ్మంగారి దేవాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని రాంనగర్ దళిత జాతీయ సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం నూతనంగా నిర్మిస్తున్న భవనం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సునీల్ మాట్లాడుతూ.. సెట్‌బ్యాక్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఆరు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని అన్నారు. భవిష్యత్‌లో కాలనీవాసులకు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ ఏసీపీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. త్వరలో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ ధర్నాలో సంఘం నాయకులు సదానంద్, భాస్కర్, మహేష్, దర్శన్, శ్రీకాంత్, పవన్, రమేష్, బ్రహ్మం, ప్రమీల, రేణుక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌కే భవన్‌కు గులాబీ శ్రేణులు

ముషీరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని బీఆర్‌ఎస్ నేతలు బింగి నవీన్, వై.శ్రీనివాస్‌రావు ఆరోపించారు. జస్టిస్ ఘోష్‌తో విచారణ జరిపించి తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీశారని అన్నారు. బుధవారం మాజీ సీఎం కేసీఆర్ బుధవారం విచారిణకు వెళ్తున్న నేపథ్యంలో బీఆర్‌కే భవన్‌కు భారీ సంఖ్యలో నాయకులు తరలి వెళ్లారు. ముషీరాబాద్ డివిజన్‌లోని శివాలయం చౌరస్తా నుంచి చేపట్టిన ర్యాలీని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు.

ఫీజుల దోపిడీ..!

అధిక ఫీజుల వసూలులో తగ్గేదేలే.. అంటున్న ప్రైవేట్ విద్యాసంస్థలు



అంబర్‌పేట డిప్యూటీ ఐఓఎస్ కార్యాలయం

- అంబర్‌పేట నియోజకవర్గంలో అరకొర వసతులతో ప్రైవేట్ స్కూళ్లు
- క్రీడా ప్రాంగణాలు, సైన్స్ ల్యాబ్ కానరాని స్కూళ్లే ఎక్కువ
- అయినా ఫీజులు పెంచుకుంటూ వెళ్తున్న ప్రైవేట్ పాఠశాలలు
- నూతన విద్యా సంవత్సరం నేపథ్యంలో ఫీజుల వసూళ్లకు సన్నాహాలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు.. ప్రశ్నించని విద్యార్థి సంఘాలు

అంబర్‌పేట: విద్యా వ్యాపారానికి తెరలేపారు. మధ్య తరగతి ప్రజల నుంచి భారీగా ఫీజులు వసూలు చేసేందుకు విద్యాసంస్థలు సన్నాహాలు చేసుకున్నాయి. త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యం అంబర్‌పేట నియోజకవర్గంలో పలు ప్రైవేట్ పాఠశాలలు కనీస ఫీజు నియంత్రణ పాటించకుండా రకరకాల ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఫీజుల మోతను మోగిస్తున్నారు. అకడమిక్ ట్యూషన్ ఫీజుతో పాటు అదనంగా అడ్మిషన్ ఫీజు, టర్మ్ ఫీజులు తీసుకుంటున్నాయి. దానికి తోడు పుస్తకాలు, యూనిఫాంలపై వసూలే లక్ష్యంగా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి.

ఫీజులు ఫుల్ వసతులు నిల్...

నియోజకవర్గంలో మెజారిటీ పాఠశాలలకు ఫీజుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ కనీస వసతులు కల్పించడంలో లేదు. పాఠశాలల్లో సరైన తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, గాలి, వెలుతురు వంటి మౌలిక వసతులు కూడా అరకొరగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పారిశుద్ధ్యం, లంచ్ సమయంలో విద్యార్థులు భోజనం చేయడానికి కావాల్సిన కనీస సౌకర్యం కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదు.

☛ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రశ్నిస్తే ముందు ఫీజు బకాయిలు చెల్లించండని తిరిగి ప్రశ్నించే సరికి మధ్య తరగతి తల్లిదండ్రులు గట్టిగా మాట్లాడలేని పరిస్థితి. ప్రైవేట్ పాఠశాలల్లో సైతం మౌలిక వసతులపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.

అటకెక్కుతున్న స్పోర్ట్స్ ఆక్టివిటీస్...

చదువులతో పాటు క్రీడలు, పరిశోధనలపై ఆసక్తిని విద్యార్థులకు పెంపొందించేలా పాఠశాల స్థాయిలోనే ప్రోత్సహించాలి. కానీ పాఠశాలల్లో చదువు తప్ప ఇతర ఎలాంటి అంశాలను పట్టించుకోవడం లేదు. క్రీడల కోసం ప్రైవేట్ పాఠశాలలకు స్థలం లేవు. సమీప మున్సిపల్ గ్రౌండ్‌లో కొంత మేరకు రుసుము చెల్లిస్తే అవకాశం ఉన్నప్పటికీ పాఠశాల యాజమాన్యాలు వినియోగించుకోవడం లేదు.

☛ పెద్ద పాఠశాలలు అని చెప్పుకునే కొన్ని పాఠశాలల్లో సరైన సైన్స్ ల్యాబ్‌లు కూడా నిర్వహించడం లేదు. సంస్కృతి, సంప్రదాయాలు చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు చేపట్టాల్సిన అంశాలను చేపట్టడం లేదు. దీంతో బడ్జెట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆర్థికంగా, ఇతర అంశాల్లో సైతం నష్టపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకే విద్యాశాఖ అధికారుల పరిమితం...

విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకే పరిమితం అవుతున్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణ, బోధన నాణ్యత, వసతులు, ఉన్నతాధికారులతో జరిగే సమావేశాలకు సంబంధిత విద్యాశాఖ అధికారులు పరిమితం అవుతున్నారు. ఇక ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షించాల్సిన అంశాలను గాలికి వదిలేస్తున్నారు.

పూర్తిస్థాయి అధికారాలు మాకు లేవు

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ అధికారాలు మాకు పూర్తిస్థాయిలో లేవు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలను మేము పాటించాల్సి ఉంటుంది. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో వసతులపై చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తాను. ప్రభుత్వ బడులను చక్కదిద్దేందుకే మాకు సమయం సరిపోతుంది.

– డిప్యూటీ డీఈఓ ఫాతిమా

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట



'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు

- పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు
- ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు అవగాహన ర్యాలీలు
- అంగన్‌వాడీల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన
- టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సామగ్రిని సమకూర్చిన అధికారులు



చిన్నారుల కోసం సిద్ధం చేసిన ఆట వస్తువులు

ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించిన ఎగ్ బిర్యానీ

కవాడిగూడ: నూతన విద్యా విధానంలో 'అంగన్‌వాడీలను సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రాలు (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్స్)'గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని విధాల బలోపేతం చేయనున్నారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

☛ హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ఏమిటంటే చిన్నారులను గుర్తించి వారిని అంగన్‌వాడీల్లో చేరుస్తారు. వారు ప్రాథమిక పాఠశాలల్లో చేరే నాటికే అక్షరాలు, అంకెలు నేర్చుకునేలా ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తారు. దీని కోసం అంగన్‌వాడీ టీచర్లకు అవసరమైన శిక్షణ ఇచ్చి సామగ్రిని సైతం సమకూర్చారు.

ఈనెల 12 నుంచి ఇంటికి వెళ్లి....

నాంపల్లి ఐసీడీఎస్ పరిధిలో 201 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 1360 మంది గర్భిణులు, 1061 మంది బాలింతలు ఉన్నారు. బాలల విషయానికొస్తే.... ఏడు నెలల నుంచి ఏడాది వయసున్న వారు 1802, 1 నుంచి 3 ఏళ్ల వయసున్న వారు 7600 మంది ఉన్నారు. నియోజకవర్గాల్లోని పది సెక్టార్లలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఇంటింటికి వెళ్లి చిన్నారులను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేలా బాలల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మొక్కలు నాటి ఆహ్లాద వాతావరణాన్ని కల్పిస్తారు. చివరి రోజు సామూహిక అక్షరాభాస్యాలు నిర్వహిస్తారు.

అంతా సహకరించాలి...

వారం పాటు నిర్వహించే 'అమ్మ మాట..... అంగన్‌వాడీ బాట'కార్యక్రమానికి అంతా సహకరించాలి. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకుక ప్రత్యేక శిక్షణ పూర్తి చేశాం. అంగన్వాడీల్లో నిర్వహించే కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. తద్వారా చిన్నారులు అంగన్‌వాడీలకు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– కృష్ణచైతన్య, సీపీడీవో ఐసీడీఎస్

జాతీయ విద్యా విధానంతో విప్లవాత్మక మార్పులు



ప్రొ. వీఎస్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న అంబేడ్కర్ కళాశాల సీఈఓ ప్రొ. లింబాద్రి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జాతీయ విద్యా విధానం–2020తో భారత విద్యారంగంలో ఒక విప్లవాత్మక మార్పు వస్తుందని ఇగ్నో(ఐజీఎన్ఓయూ) మాజీ వీసీ ప్రొ. వీఎస్ ప్రసాద్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో బుధవారం 'సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక'అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నాణ్యమైన విద్యను అందించేలా ప్రతి విద్యాసంస్థ చర్య తీసుకోవాలన్నారు. ప్రతి సంస్థ స్వయం విశ్లేషణ ద్వారా తాము ఎక్కడ ఉన్నమో.. ఎటు పోవాలో.? నిర్ణయించుకోవడం ముఖ్యమని అన్నారు. సమానత్వం, న్యాయ సమాజ నిర్మాణం, అత్యుత్తమ బోధన విధానాలు, విద్యలో లౌకికత ప్రతిబింబించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కళాశాల ప్రతినిధులు ప్రొ. వీఎస్ ప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ప్రొ. లింబాద్రి, డైరెక్టర్ డా. విష్ణుప్రియ, ప్రొ. యాదగిరి, ప్రిన్సిపల్ డా. మట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీలిమిటేషన్ వెనుక కేంద్రం రహస్య ఎజెండా



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: జన గణనతో పాటు కులగణన సేకరణను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తూ.. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియలో రహస్య ఎజెండాతో వ్యవహరిస్తోందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆరోపించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలిమిటేషన్ ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా ఉండొచ్చని... దీనిని అడ్డుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ యాదృచ్ఛికం కాదని దీని వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. 2026లో ప్రారంభమయ్యే జనగణన, కులగణన ప్రక్రియలు 2027 వరకు వాయిదా పడుతుండటం ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ విధానాలను కచ్చితంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల పార్లమెంట్ సీట్లను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

◆ 2027లో చేపట్టనున్న జనాభా గణన, 1971 గణన స్థానంలో ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనకు ఉపయోగపడనుందని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించి, పార్లమెంట్‌లో తమకు అనుకూలంగా పునర్వ్యవస్థీకరణ చేసుకోవాలనే లక్ష్యంతో బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇది దక్షిణాది రాష్ట్రాలను పణంగా పెట్టే కుట్ర అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కాపాడుకోవడానికి వ్యూహాత్మక చర్యలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందని కుమారస్వామి పిలుపునిచ్చారు. అప్రమత్తంగా ఉండి దక్షిణాది రాష్ట్రాల హక్కులను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు, మేధావులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని జీహెచ్‌ఎంసీ డ్రైవర్ మృతి

కాచిగూడ: పట్టాలు దాటుతూ రైలు ఢీకొని జీహెచ్‌ఎంసీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బుద్వేల్‌లో నివాసం ఉంటున్న కావలి శేఖర్ (30) జీహెచ్‌ఎంసీలో డ్రైవర్. బుధవారం ఉందానగర్ – బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్ భవన నిర్మాణం మాకు సమ్మతమే..

ఖాళీ చేయడానికి ఏడాది సమయం కావాలి: వ్యాపారులు

చిక్కడపల్లి: వారం రోజులుగా చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ యార్డులోని దుకాణాలను ఖాళీ చేయాలని అధికారులు సూచిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాంధీనగర్ కార్పొరేటర్ పావనితో దుకాణుదారులతో కలిసి బుధవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 అధికారులతో అంతర్గతంగా భేటీ అయ్యారు. తొమ్మిదంస్తుల భవనం నిర్మాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఖాళీ చేస్తే పనులు ప్రారంభిస్తామని డీఎంసీ రామాంజనేయులురెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ తెలిపారు. నూతన భవన నిర్మాణానికి తాము సమ్మతమేనని ఖాళీ చేయడానికి ఏడాది సమయం కావాలని దుకాణుదారులు కోరారు. అయితే అంత సమయం ఇవ్వడం కుదరదని అన్నారు. ఎంత సమయం ఇస్తామనేది నగర మున్సిపల్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్‌తో మాట్లాడి వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. దుకాణాల అద్దె బకాయిల విషయంలో సందిగ్ధత నెలకొందని మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. 20 ఎస్‌ఎఫ్‌టీ దుకాణానికి 250 ఎస్‌ఎఫ్‌టీ ఉన్నట్లుగా లెక్కగట్టి అద్దె కట్టాలని సూచిస్తున్నారని అధికారులకు తెలిపారు. ఈ తప్పులను సరిదిద్దాలని కోరడంతో డీఎంసీ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



బడిబాట ర్యాలీలో నినాదాలు చేస్తున్న కార్పొరేటర్ పావని, ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిక్కడపల్లి: ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పాఠశాలలు ఎంతగానో కృషి చేస్తున్నాయని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. జవహర్‌నగర్ ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ఉంటారని నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులను ఇస్తారని తల్లిదండ్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడే దేవదాస్, ఉపాధ్యాయులు శోభారాణి, సునీత, ప్రవళిక, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌బీఐ డీడీకాలనీ బ్రాంచ్ మేనేజర్ శ్రీలత



అంబర్‌పేట: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నట్లు ఎస్‌బీఐ డీడీ కాలనీ శాఖ బ్రాంచ్ మేనేజర్ శ్రీలత తెలిపారు. ఇటీవల ఆమె బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం మాట్లాడారు. ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్‌బీఐలో పెట్టే పెట్టుబుడులకు ఆకర్షణీయమైన రాబడులు ఉన్నాయన్నారు. ఆరోగ్య బీమా వంటివి ఎస్‌బీఐలో సామాన్యులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖాతాదారులు సైబర్ నేరగళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎస్‌బీఐ నుంచి ఖాతాదారులకు ఎలాంటి ఫోన్‌కాల్స్ రావన్నారు. ఓటీపీలు, మెయిల్స్, ఎస్‌ఎంఎస్‌ల పట్ల అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు.

వాలీబాల్ గ్రౌండ్ పనులను పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన వాలీబాల్ గ్రౌండ్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ ఆశాలత, డీఐలు సన్నీ, గీతాకుమారి, ఏఈ మురళీలతో బుధవారం ఆమె గ్రౌండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రౌండ్‌లో సిట్టింగ్ గ్యాలరీ, ప్రహరీ, ఓపెన్‌జిమ్ పనులను వేగవంతం చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచి ముదిరాజ్, అనిల్‌కుమార్, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ మాల్ సీజ్

ఫిర్యాదుల నేపథ్యంలో స్పందించిన జీహెచ్‌ఎంసీ

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో కొంతకాలం కిందట ఏర్పాటైన ఓ షాపింగ్‌మాల్‌కు తాళం వేశారు. మాల్ కొనసాగుతున్న భవన సముదాయానికి ఇంతవరకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ మంజూరు కాలేదు. ఏఎంబీ మినీ మల్టీప్లెక్స్ పేరుతో నిర్మిస్తున్న ఈ భవనం పనులు ఇంకా పూర్తి కాలేదు. ఒక్క పక్క నిర్మాణ పనులు కొనసాగుతుండగానే గతేడాది కింది అంతస్తులో ఓ షాపింగ్‌మాల్ ఏర్పాటు చేశారు. నిబంధనలను తుంగలో తొక్కి వాణిజ్య కార్యకలాలు నిర్వహిస్తున్నారంటూ జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్పందించిన జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం ఉదయం ఓ మాల్‌ను సీజ్ చేశారు. టౌన్‌ప్లానింగ్ అదనపు సీపీ ప్రదీప్ పర్యవేక్షణలో ప్రధాన కార్యాలయం ఏసీపీ భార్గవి, సర్కిల్ 15 ఏసీపీ రామిశెట్టి దేవేందర్ సహ పలువురు అధికారులు మాల్‌ను సీజ్ చేశారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

బీమా కంపెనీల టెండర్లను రద్దు చేయాలి



కార్మికశాఖ అదనపు కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐటీయూసీ నేతలు

చిక్కడపల్లి: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం పొందినా క్లెయిమ్ చేసుకోవడానికి ప్రైవేట్ బీమా రంగానికి అప్పజెప్పాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ (టీబీసీ డబ్ల్యూయూ) గౌరవ అధ్యక్షుడు ఎం.నరసింహ, ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్‌ను కలసి వారు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో కోట్ల నిధులున్నా కార్మికులకు నిధులు మంజూరు చేయకుండా బీమా కంపెనీలకు అప్పజెప్పడం విచారకరమని అన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీమా కంపెనీలకు అప్పజెప్పే టెండర్లను వెంటనే రద్దు చేయాలన్నారు. లేకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు గన్నారపు రమేష్, బి.వెంకటేశం, యాదగిరి, నరసింహారెడ్డి, కిషన్, ఉపర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



బస్‌భవన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

ముషీరాబాద్: బస్‌పాస్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బస్‌భవన్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ఈడీ(ఆపరేషన్స్) పవీ మునిశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నగర కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ... ఆర్టీసీ యాజమాన్యం 20 నుంచి 50 శాతం వరకు బస్‌పాస్ చార్జీల పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాలపై భారం వేసిందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎం.మహేందర్, నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఆర్.వెంకటేష్, జె.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో...

ముషీరాబాద్: విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను పెంచొద్దని డిమాండ్ చేస్తూ బస్ భవన్ ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మహానగర కార్యదర్శి పృథ్వీతేజ మాట్లాడుతూ... విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు పెంచడాన్ని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు అసలే ఆకాశాన్ని అంటుతుంటే మళ్లీ చార్జీల పెంచి గుదిబండ మోపారన్నారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, అక్షిత, శివశంకర్, రేవంత్, హరీష్, సాయితేజ, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన కార్యక్రమాలు చేపడతాం..

కాచిగూడ: ఆర్టీసీ యాజమాన్య టీవల 20 నుంచి 50శాతం వరకు పెంచిన బస్‌పాస్ చార్జీలతో పేద, మధ్య తరగతి ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.